క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

ఈపూరు(శావల్యాపురం): ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి (డీడీఏ) మద్దినేని శివకుమారి సూచించారు. మంగళవారం ఈపూరు మండలం కొచ్చర్ల, ఉప్పరపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా డీడీఏ శివకుమారి మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను ఉపయోగించి భూమి సారాన్ని పరిరక్షించాలన్నారు. వరి మొక్కజొన్న మిరప పంటలను సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కౌలు రైతు కార్డులు నమోదు, పంట నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో అరుణ, ఏవో రామినేని రామారావు, ఏఈవోలు కిషోర్ కుమార్, సునీత, వీఏఏ కోటేశ్వరరావు, రైతులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, శరభయ్య పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

రొంపిచర్ల: పంటల బీమాను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. మండలంలోని వీరవట్నం, అన్నవరప్పాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరి పంటకు ఎకరానికి రూ.80 ప్రీమియం రైతు చెల్లించాలన్నారు. అలాగే ఎర్రమిరప పంటకు ఎకరాకు రూ.360లు, కంది పంటకు ఎకరాకు రూ.40లు చొప్పున చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ ప్రీమియంను సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌కు గాని, అసిస్టెంట్‌కు గాని, సీఎస్‌సీ సెంటర్‌లో, పోస్టాఫీసుల్లో కూడా చెల్లించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్, వెటర్నీ అసిస్టెంట్‌లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో భారీ వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాలో భారీ వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 37.8 ఎం.ఎ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా మండలంలో వర్షాలు కొనసాగుతున్నాయి. వర్షానికి పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. వర్షాల కారణంగా కొన్ని గ్రామాల్లోని రోడ్లు చిత్తడిచిత్తడిగా మారాయి. వ్యవసాయ పనులు నిలిచిపోయాయి.

ఘనంగా అహోరాత్ర రుద్ర పారాయణ యాగం

వినుకొండ : పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ పక్కన గల పాత శివాలయంలో పట్టణ అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో అహోరాత్ర రుద్ర పారాయణ యాగం ఘనంగా నిర్వహించారు. ఈ యాగంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం కోసం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పురోహిత సంఘం ఈ యాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, సంఘం సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు రూ.2 కోట్లు

నరసరావుపేట: నియోజకవర్గంలో ఆధునిక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యవేక్షణలో అమలు చేస్తారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో 42 సెంట్ల స్థలంలో ఈ డిజిటల్ లైబ్రరీ నిర్మాణం చేస్తామన్నారు. మంగళవారం ఆ స్థలాన్ని ఆర్డీఓ కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని వారు తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

నూజెండ్ల: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎంఎల్ఎ,చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఐనవోలు గ్రామంలో నూతన ప్రభుత్వ వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్,ఎంఎల్ఎ జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ నూతన వైద్యశాల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు చేరువయ్యాయన్నారు. నూతన పిహెచ్‌సిలో ఆధునిక వైద్య పరికరాలుతో పాటు తగినంత సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా జీడీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, సొసైటీ అధ్యక్షులు ముంద్రు సుబ్బారావు, రావులపల్లి బుజ్జి, బుల్లయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పని చేయకపోతే చర్యలు తప్పవు

నూజెండ్ల: చెత్త సేకరణ చేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న క్లాప్‌మిత్రలను తొలగించటం జరుగుతుందని ఎంపీడీవో పి.ఉమాదేవి హెచ్చరించారు.గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో మురుగు నిల్వలు ఉన్నా, చెత్త కనిపించినా క్లాప్‌మిత్రలతో పాటు పంచాయితీ సెక్రటరీలు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, సాక్షరభారత్ మండల కో ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య,సెక్రటరీ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఓటేసి తప్పు చేశామనుకుంటున్నారు

- వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి
- కోటప్పకొండలో నరసరావుపేట మండల కార్యకర్తల సమావేశం
- బాబు ష్యూరిటీ మోసం – గ్యారెంటీ కార్యక్రమంపై సమీక్ష



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

నరసరావుపేట రూరల్: కూటమికి ఓటేసి తప్పుచేశామనే భావన ప్రజలకు ఏర్పడిందని, ఏడాది కాలంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై అవగాహన కల్పించి ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కోటప్పకొండలోని రెడ్లసత్రంలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంపై నరసరావుపేట మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ మోసం, వెన్నుపోటుకు సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. 2014 ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణమాఫీ అంటూ ప్రజలను మోసం చేశాడని తెలిపారు. 2024లో మరోసారి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. సూపర్ సిక్స్ అన్ని అమలు చేశామని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తల్లికి వందనం పథకంలో దాదాపు 30 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ పథకంలో నగదు జమ కాకపోవడంతో మహిళలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన ఇప్పటి వరకు నిరుద్యోగభృతి ఊసే లేదన్నారు. పచ్చ మీడియా ప్రచారం తప్పించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కొత్త కంపెనీలు రావడం లేదని, 20 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం అని చంద్రబాబు చేప్తే నమ్మి మహిళలు తీర్థయాత్రలకు వెళ్లాలని కలలు కన్నారని, ఇప్పుడు ఉచిత బస్సు కేవలం జిల్లాలకే పరిమితం చేయడంతో పాటు కాలం చెల్లిన పల్లెవెలుగు బస్సులను ఈ పథకానికి సిద్ధం చేస్తున్నాడని తెలిపారు. మహిళలకు ప్రతి నెల రూ.1500 ఇస్తే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పథకాలకు ఎంత ఖర్చు అవుతుందో తెలియకుండా ఎన్నికల సమయంలో ఎలా హామీలు ఇచ్చారని డాక్టర్ గోపిరెడ్డి ప్రశ్నించారు.

కార్యకర్తలకే తొలి ప్రాధాన్యం..

గత ప్రభుత్వంలో కార్యకర్తలకు నష్టం జరిగిందన్న విషయాన్ని మాజీ సీఎం జగన్ గుర్తించారని తెలిపారు. 2029లో కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల నుంచి ప్రభుత్వ కార్యక్రమాల వరకు కార్యకర్తల ద్వారానే అమలు చేస్తామని తెలిపారు.

గత ప్రభుత్వంలో మండలంలో రూ.445 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్వహించామని గుర్తుచేశారు. ఏడాది కాలంలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని టీడీపీ నాయకులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాస రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాతపాల్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, నరసరావుపేట, రొంపిచర్ల మండల కన్వీనర్లు తన్నీరు శ్రీనివాసరావు, కురుగంటి శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ విభాగం నాయకురాలు హెల్డా, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం జగనన్న ఘనత

కరోనా సమయంలో ఆర్థిక వనరుల లేకపోయినా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని, ఏడాది గడిచినా రైతు భరోసా పథకంలో నిధులు విడుదల చేయలేదని తెలిపారు. ఆర్‌బీకేలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలను పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలకు జగన్ కారణమంటూ టీడీపీ నాయకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ జగన్ నామస్మరణతోనే టీడీపీ నాయకులు కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసే విధంగా బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని తెలిపారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

పలు కళాశాలల్లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ ఎం.వి. చరణ్, ఎస్ఐ వంశీకృష్ణ



మాట్లాడుతున్న సీఐ హైమారావు

నరసరావుపేట టౌన్: విద్యార్థి దశ ఎంతో విలువైనదని మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఎం.విజయ్ చరణ్, హైమారావులు అన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు కళాశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అన్న అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మంచి భవిష్యత్తు నిర్మించుకొని ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. ఒత్తిడి వచ్చినప్పుడు దాన్ని అధిగమించటానికి క్రీడలు, సంగీతం, యోగా వంటివి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరిబాబు, వంశీకృష్ణ, మహిళ ఎస్ఐలు లేఖ ప్రియాంక, అరుణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



నరసరావుపేట రూరల్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేటరూరల్: దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విచారణలో ఉన్న కేసుల పురోగతి, దర్యాప్తు అంశాలను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న కేసులలో సత్వరమే దర్యాప్తు పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో సీసీటీఎన్‌ఎస్ పనితీరు గుర్తించి సీఐ పి.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. విచారణలో ఉన్న పోక్సో కేసులు, ఎస్‌సీ,ఎస్‌టీ అట్రాసిటీ కేసులపై ఆరా తీసారు. రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజువల్ పోలీసింగ్ నిర్వహించి, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని తెలిపారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. పెండింగ్ కేసులు తగ్గించాలని, దొంగతనం కేసులలో ప్రాపర్టీ రికవరిపై దృష్టిసారించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన పిటిషన్‌లను త్వరిగతిన విచారించి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఫైరోజ ఫాతిమాలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో పలువురికి పతకాలు



తులసీ తన్మయ్‌ను అభినందిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల నర్సింగ్ విద్యార్థిని వి.తులసీతన్మయ్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా రేపల్లెలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి సీనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీల్లో తులసీతన్మయ్ 46 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిందని వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ ఇన్‌చార్జ్ ఏవీఎన్ గుప్త తదితరులు అభినందించారు.

శంకరభారతీపురం విద్యార్థులు

నరసరావుపేట రూరల్: రేపల్లెలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు టి.జాన్‌పాల్, జి.దేవరాజ్‌లు బంగారు పతకాలు సాధించినట్లు వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులు ప్రదానోపాధ్యాయురాలు పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు యు.పద్మావతి, పి.తిరుపతిరావు, ఎస్‌కె ఫాతిమా, ఎస్‌కె రషీదా, అభినందించారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ ఫిర్యాదు



ఎస్సైతో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

నూజెండ్ల: పెట్రోల్‌తో దాడిచేసి ఇరువురి మరణానికి కారణమైన నిందితులను అరెస్టు చేయాలంటూ ఐనవోలు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు ఎస్సై కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16 వ తేదీన ఐనవోలు గ్రామంలో నిద్రిస్తున్న దంపతులు నీలబోయిన పెద శ్రీను, భార్య మంగమ్మ పై పెట్రోల్‌తో దాడి జరిగింది. తీవ్రంగా గాయపడిన దంపతులను చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. అదే రోజు మంగమ్మ మృతి చెందగా పరిస్థితి విషమించి పెద శ్రీను 21వ తేదీ మరణించిన సంఘటన విదితమే. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా బంధువైన నీలబోయిన యలమందని వెంటనే నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు రిమాండ్ విధించగా జైలుకు తరలించారు. ఈ క్రమంలో జంట హత్యతో సంబంధం ఉన్న నిందితుడి కుటుంబ సభ్యులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్సై కృష్ణా రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులును కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సీఐ ప్రభాకర్‌కి ఫోన్ చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగాలని తెలిపారు.

దాశరథి సాహిత్యం చిరస్థాయిగా నిలిచింది

ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ పీవీ సుబ్బారావు

చిలకలూరిపేటటౌన్: అగ్నిధార, రుద్రవీణ వంటి శక్తివంతమైన అభ్యుదయ కావ్యాలు రచించిన ప్రజాకవి దాశరథి సాహిత్య ప్రపంచానికి చిరస్థాయిగా నిలిచారని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన దాశరథి శతజయంతి ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఓ నిజాం పిశాచమా', 'మా నిజాం తరతరాల బూజు' అనే ధైర్యవంతమైన పదాలతో నిజాం పాలనను ఎదిరించి జైలుకు వెళ్లిన ప్రజాకవిత్వానికి ప్రతీక దాశరథి అని కొనియాడారు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని తన ప్రాంతీయతను గర్వంగా ప్రకటించిన దాశరథి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అభిప్రాయపడ్డారు. అంతేకాక ఆయన రాసిన ఎన్నో జనరంజక సినిమా పాటలు తెలుగు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయని చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, పాఠకులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

టాటా వ్యాసరచన పోటీల్లో కేరిడ్జ్‌కు పతకాలు



విద్యార్థులతో చైర్మన్ నాతాని, ప్రిన్సిపల్ బర్నబాస్, టాటా ప్రతినిధులు

నరసరావుపేట: స్థానిక కేరిడ్జ్ పాఠశాలలో మంగళవారం టాటా కంపెనీ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ స్థాయిల్లో నిర్వహించిన స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు నేనే చేసే ఐదుపనులు (ఫైవ్ థింగ్స్ ఐవిల్ డూ టు బిల్డ్ ఏ సెల్ఫ్ రిలయంట్ ఇండియా) అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీనిలో పాల్గొన్న పాఠశాలకు చెందిన పి.వెంకట శ్రీజాహ్నవి (7వ తరగతి), ఎ.దేవీదీక్ష (9వ తరగతి) బంగారు పతకాలు సాధించగా షేక్ అబ్దుల్ లతీఫ్ (6వ తరగతి), కావ్యశ్రీ భాయ్ (9వ తరగతి)లు రజితం పతకం, కె.సాయి సంప్రీత్ (8వ తరగతి), సీహెచ్. హరితేజస్వి (9వ తరగతి) కాంస్య పతకం పొందారు. వీరందరూ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించి అభినందించారు. జాతీయస్థాయిలో మంచి ప్రతిభను కనబర్చాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ జి.బర్నబాస్, డైరక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజి పాల్గొనగా టాటా సంస్థ ప్రతినిధులు సందీప్ రామాంజనేయులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నూజెండ్ల: ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపుతప్పి క్రింద పడటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలపిన వివరాల ప్రకారం ఈ నెల 18 వ తేదీన మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల సాంబయ్య (63) పనుల నిమిత్తం వినుకొండ వెళ్ళి రాత్రికి తిరిగి స్వగ్రామం బయలు దేరాడు. తలార్లపల్లె సమీపంలో కాలువకట్ట వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కావటంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుణ్ణి వినుకొండ వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. వైద్యశాలలో నాలుగు రోజులుగా చికిత్స పొందతూ పరిస్థితి విషమించటంతో సాంబయ్య మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య సావిత్రి, కొడుకు,కూతురు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత

చిలకలూరిపేట: వృద్ధులను గౌరవించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. దాత నాదెండ్ల రంగనాయకమ్మ అందించిన ఆర్థిక సహాయంతో ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సాయి కృప ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, మందులు, నిత్యావసరాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, ఆశ్రమ నిర్వాహకురాలు షేక్ అమీనా సభ్యులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వాయిదా వేయాలి

నరసరావుపేట: ట్రాన్స్‌పోర్టు వాహనాల డ్రైవింగ్ శిక్షణ పొందే అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ వాయిదా వేయాలని రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ ప్రెసిడెంట్, డ్రైవింగ్ శిక్షణ సంస్థ నిర్వాహకురాలు ఆర్.కనకదుర్గ పద్మజ కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని రవాణా శాఖ కమిషనర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించామని ఆమె పేర్కొన్నారు.

పీ4పై విస్తృత ప్రచారం చేయాలి

నాదెండ్ల: పీ4 కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి ఎక్కువమంది భాగస్వాములయ్యేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలని సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి చెప్పారు. నాదెండ్ల పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు-పబ్లిక్ పార్టనర్ షిప్‌లో భాగంగా దిగువ మధ్యతరగతి వర్గాలకు మేలు జరిగేలా కార్యక్రమం రూపొందించబడినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మక్కెన సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత విధానంలో పోషకాహారం పంపిణీ చేయాలి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే పోషకాహారం పాత విధానంలో పంపిణీ చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సమగ్ర శిశు అభివృద్ధి కేంద్ర కార్యాలయం ఎదుట బాలింతలు, గర్భిణులతో కలిసి నిరసన తెలిపి పీడీ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని నిరసిస్తున్నామన్నారు. చిన్నపిల్లలతో గంటల తరబడి కేంద్రాలలో కూర్చోవడం కష్టమని, ఫేస్‌యాప్ కారణంగా పదేపదే కేంద్రాలకు రావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాధవి, రమణ, పద్మ, సాయి, తులసి పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి పరిధిలోని పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం చేపట్టారు. అదుపులోకి తీసుకున్నవారి వద్ద నుంచి రూ.8,200 నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.